PRGI REGN NO: APTEL/26/A3695

నేటి మినిట్ టు మినిట్

తెలుగు దిన పత్రిక

NETI MINUTE TO MINUTE

TELUGU DAILY

సంపుటి: 01 సంచిక :152 ఎడిషన్ : అనంతపురము మరియు సత్యసాయి జిల్లా, తేది : మంగళవారం -17 నవంబర్ 2026, పేజీలు -4 వెల 1/-

VOLUME:01 ISSUE:152 EDITION: ANANTHAPURAMU, SATHYA SAI DIST. DATE: TUESDAY 17 NOVEMBER 2026 PAGES: 04 RS:01/



అమెరికా ఆధిపత్యంపై
ఆసియాలో నిరసనలు

● ట్రంప్ పర్యటనకు ఫిలిప్పీన్స్‌లో వ్యతిరేకత ● పశ్చిమాసియా యుద్ధం ఆపాలని, అమెరికా జోక్యం నిలిపివేయాలని డిమాండ్

మనీలా,నవంబర్ 16(నేటి మినిట్ టు మినిట్): ఆసియా దేశాలపై ఆధిపత్యం కోసం అమెరికా అనుసరిస్తున్న రాజకీయ, ఆర్థిక వ్యూహాలకు వ్యతిరేకంగా ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో నిరసనలు వెల్లువెత్తాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పర్యటన నేపథ్యంలో వామపక్ష సంఘాలు, విద్యార్థులు, కార్మికులు ఆందోళనలు నిర్వహించారు. పశ్చిమాసియా యుద్ధాన్ని నిలిపివేయాలని, అమెరికా జోక్యాన్ని అడ్డుకోవాలని, అమెరికా మిగతా2లో...

కోస్తాంధ్రకు తుపాను ముప్పు

● ఈ నెల 20న తీరం తాకనున్న తీవ్ర తుపాను.. 19, 20 తేదీల్లో భారీ వర్షాలు

● ఏడు జిల్లాలపై ప్రభావం ఉండే అవకాశం.. ముందస్తు చర్యలకు సీఎం చంద్రబాబు ఆదేశాలు

● ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధం చేయాలని సూచన

అమరావతి,నవంబర్ 16(నేటి మినిట్ టు మినిట్): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుపానుగా బలపడుతుండటంతో ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతానికి ముప్పు పొంచి ఉంది. ఈ నెల 20న కోస్తాంధ్ర తీరాన్ని తుపాను తాకే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను ప్రభావంతో ఈ నెల 19, 20 తేదీల్లో కోస్తాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు ఎలాంటి



ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆర్టీజీఎస్ కేంద్రం వద్ద తుపాను పరిస్థితిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. బంగాళాఖాతంలో ప్రస్తుతం కేంద్రీకృతమైన తీవ్ర వాయుగుండం మరింత బలపడి సోమవారం సాయంత్రానికి తుపానుగా మారే అవకాశం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. తుపాను కదలికలు, దాని తీవ్రత, తీరం వైపు మిగతా2లో...

ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించేందుకు
అనుమతివ్వాలి

సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఇండియా కూటమి నేతలు

ఎన్నికల సంఘానికి 48 ప్రశ్నలు.. అఫిడవిట్‌లో సమాధానాలు లేవని అభ్యంతరం



2లో

రామోజీ సేవలు చిరస్మరణీయం

రామోజీ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తాం: చంద్రబాబు

తొమ్మిది రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి ఎక్సలెన్స్ అవార్డులు ప్రదానం:కేంద్ర హోంమంత్రి అమిత్ షా



అమరావతి,నవంబర్ 16(నేటి మినిట్ టు మినిట్): రామోజీ సంస్థల వ్యవస్థాపకుడు రామోజీరావు సమాజానికి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కొనియాడారు. వ్యక్తులు తమ కృషి, పట్టుదలతో సంస్థలుగా, వ్యవస్థలుగా ఎదుగుతారని, అలాంటి అరుదైన వ్యక్తుల్లో రామోజీరావు ఒకరని పేర్కొన్నారు. రామోజీరావు 90వ జయంతిని పురస్కరించుకుని సోమవారం విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన రామోజీ ఎక్సలెన్స్ మిగతా2లో...

కుటుంబంపై నిజాలు చెప్పేందుకే
ఆత్మకథ: సోనియా

'బిలాంగింగ్' పుస్తకాన్ని ఆవిష్కరించిన కాంగ్రెస్ అగ్రనేత

తల్లిదండ్రుల అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురైన రాహుల్



న్యూఢిల్లీ,నవంబర్ 16(నేటి మినిట్ టు మినిట్): తన కుటుంబంపై ఎన్నో ఏళ్లుగా తప్పుడు కథనాలు ప్రచారంలోకి వచ్చాయని, వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఆత్మకథ రాసినట్లు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ తెలిపారు. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరుతో రచించిన పుస్తకాన్ని సోమవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీతో పాటు పలువురు ప్రతిపక్ష నేతలు పాల్గొన్నారు.తన అత్త ఇందిరాగాంధీ, భర్త రాజీవ్‌గాంధీ, పిల్లలు రాహుల్, ప్రియాంక గురించి వాస్తవాలకు దూరంగా అనేక కథనాలు ప్రచారమయ్యాయని సోనియా పేర్కొన్నారు. వాటికి తన అనుభవాల ద్వారా సమాధానం చెప్పాలనే ఉద్దేశంతో పుస్తకం రాసినట్లు వివరించారు. మొదట్లో రచనకు సంకోచించినప్పటికీ రాహుల్, ప్రియాంక ప్రోత్సాహంతో ముందుకు వచ్చినట్లు తెలిపారు.ఇటలీ నుంచి భారత్‌కు వచ్చి కొత్త కుటుంబం, సంస్కృతి, సంప్రదాయాలకు అలవాటు పడిన అనుభవాలను పుస్తకంలో వివరించినట్లు చెప్పారు. మిగతా2లో...


2లో

ఖేలో ఇండియా గేమ్స్‌కు
పటిష్ఠ ఏర్పాట్లు

డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో జాతీయ క్రీడా పోటీలు

ఆరు నగరాల్లో నిర్వహణ.. సుమారు 8 వేల మంది క్రీడాకారులు, ప్రతినిధుల రాక

ఓట్లు అడిగే ధైర్యం
టీడీపీకి లేదు

● స్థానిక ఎన్నికలను పోలీసులకు కాంట్రాక్టు ఇచ్చారు ● వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శ


2లో

హరీశ్‌రావు అవినీతిపై
విచారణ జరగాలి: కవిత

ప్రజాక్షేత్రంతో పాటు న్యాయపోరాటం చేస్తాం

త్వరలో భైరవ వాహనంతో రాష్ట్రవ్యాప్త యాత్ర


2లో

కోస్తాంధ్రకు తుపాను ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

కదిలే దిశను నిరంతరం పర్యవేక్షించాలని సీఎం సూచించారు. వాతావరణ శాఖ నుంచి అందే తాజా సమాచారాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. **ఏడు జిల్లాలపై ప్రభావం**రానున్న తుపాను ప్రభావం కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలపై ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆయా జిల్లాల్లోని తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు. భారీ వర్షాలు కురిసే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయాలని ఆదేశించారు. గతంలో వచ్చిన ఆర్నబ్ తుపాను తరహాలోనే ఈ తుపాను ప్రభావం ఉండే అవకాశం ఉందని అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. కేంద్ర బృందం చేసిన సిఫార్సులను కూడా పరిగణనలోకి తీసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని స్పష్టం చేశారు. **సహాయక బృందాలు సిద్ధం చేయాలి** తుపాను తీవ్రత పెరిగి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడితే ఎలాంటి జాప్యం జరగకుండా ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే సిద్ధం చేయాలని చంద్రబాబు ఆదేశించారు. అవసరమైన ప్రాంతాలకు సహాయక బృందాలను పంపేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు సంబంధిత శాఖల సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. తీర ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. **విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా..** భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు, తీగలు దెబ్బతినే అవకాశం ఉన్నందున విద్యుత్ శాఖ ప్రత్యేక కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని సీఎం సూచించారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించేలా సిబ్బంది, అవసరమైన సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. తాగునీరు, రహదారులు, పారిశుధ్యం వంటి అత్యవసర సేవలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖలు ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. **వరద నీటిని రిజర్వాయర్లకు మళ్లించాలి** భారీ వర్షాల వల్ల వచ్చే వరద ప్రవాహాలను సమర్థంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షపు నీటిని వృథాగా సముద్రంలోకి వెళ్లకుండా సాధ్యమైన ప్రాంతాల్లో రిజర్వాయర్లకు మళ్లించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జలాశయాల్లో నీటి నిల్వలు, వరద ప్రవాహాల పరిస్థితిని నిరంతరం పరిశీలించాలని తెలిపారు. తుపాను వల్ల పంటలు, ఆస్తులు, ప్రజలకు నష్టం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. తుపాను తీరం దాటే సమయానికి అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని, శాఖల మధ్య సమన్వయం లోపించకుండా చర్యలు చేపట్టాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజలు కూడా వాతావరణ శాఖ, ప్రభుత్వ అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించేందుకు అనుమతివ్వాలి

న్యూఢిల్లీ,నవంబర్ 16(నేటి మినిట్ టు మినిట్): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించేందుకు అనుమతించాలని ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టును కోరారు. ఈ మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు, ఎన్నికల సంఘం ఐటీ విభాగం డైరెక్టర్ జనరల్‌కు 48 ప్రశ్నలు సంధించేందుకు అనుమతి ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీతో పాటు మరో పది మంది కూటమి నేతలు ఈ అభ్యర్థనలో భాగస్వాములయ్యారు. ఎన్నికల సంఘం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో తమ సందేహాలకు సరైన సమాధానాలు ఇవ్వలేదని ఇండియా కూటమి నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహించాలని ఎవరు నిర్ణయించారు? అందుకు ఎప్పుడు ఆమోదం తెలిపా రు? ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చేందుకు ఉపయోగించే ఫారం-6లో మార్పులు చేయాలని ఎవరు నిర్ణయిం చారు? ఈ నిర్ణయాలకు ఎన్నికల కమిషనర్లందరి ఆమోదం ఉందా? అనే ప్రశ్నలను లేవనెత్తారు.అలాగే ఎన్నికల సంఘానికి చెందిన ఈఆర్ఓనెట్, ఈసీఐనెట్ డిజిటల్ వ్యవస్థలను కేంద్రీకరించాలనే నిర్ణయం ఎవరు తీసుకున్నారు? ప్రధాన ఎన్నికల కమిషనర్ తీసుకున్న నిర్ణయాలతో మిగిలిన ఇద్దరు కమిషనర్లు ఎన్నిసార్లు విభేదించారు? వారి అభ్యంతరాలు అధికారికంగా నమోదు చేశారా? అనే అంశాలపై వివరాలు కోరారు.గతంలో ఎన్నికల సంఘం దాఖలు చేసిన అఫిడవిట్లు తమ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వలేదని ప్రతిపక్ష నేతలు పేర్కొన్నారు.48 ప్రశ్నలకు సంబంధిత అధికారులు అఫిడవిట్ల రూపంలో సమాధానాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజకీయంగా, న్యాయపరంగా చర్చ మరింత వేడెక్కింది.ఎన్నికల సంఘం మాత్రం ఎస్ఐఆర్‌కు సంబంధించిన కీలక నిర్ణయాలన్నీ ముగ్గురు సభ్యుల ఏకాభిప్రాయంతోనే తీసుకున్నామని ఇప్పటికే కోర్టుకు తెలిపింది.ప్రతిపక్ష కూటమి లేవనెత్తిన ప్రశ్నలపై సుప్రీంకోర్టు ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

రామోజీ సేవలు చిరస్మరణీయం

(మొదటి పేజీ తరువాయి)

అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన పాల్గొన్నారు. తొమ్మిది రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు అవార్డులు అందజేశారు.ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. కృష్ణా జిల్లాలోని సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన రామోజీరావు తన కృషి, పట్టుదలతో ఉన్నత స్థాయికి ఎదిగారని తెలిపారు. తెలుగు పాఠకులకు ప్రతిరోజూ తాజా సమాచారాన్ని అందించాలనే లక్ష్యంతో ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. దేశంలోని రాజకీయ, సామాజిక అంశాలపై ఆయనకు లోతైన అవగాహన ఉండేదని, సమస్యలను విశ్లేషించి పరిష్కారాలను సూచించడంలో ప్రత్యేకత చూపేవారని గుర్తుచేశారు.రామోజీరావు సూచించిన రాజకీయ విశ్లేషణలు అనేక సందర్భాల్లో నిజమయ్యాయని అమిత్ షా పేర్కొన్నారు. సినిమా రంగానికి కూడా ఆయన విశేష సేవలు అందించారని, రామోజీ ఫిలింసిటీ సినీ నిర్మాణానికి అవసరమైన అన్ని సదుపాయాలను ఒకే చోట కల్పిస్తోందని అన్నారు.ఆ

రామోజీరావుకు పద్మవిభూషణ్ పురస్కారం రావడం తెలుగు ప్రజలకు, పాత్రికేయ రంగానికి దక్కిన గౌరవమని తెలిపారు. వచ్చే పదేళ్లలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. **రామోజీ జయంతి రాష్ట్ర పండుగ** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రామోజీరావు జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇకపై ప్రతి సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని వెల్లడించారు.

రామోజీ పేరుతో అవార్డులు ఏర్పాటు చేసి, జయంతి సందర్భంగా ప్రదానం చేయడం మంచి పరిణామమన్నారు.

జర్నలిజం, కళలు, సంస్కృతి, గ్రామీణాభివృద్ధివ్యవసాయం, మహిళా సాధికారత, సైన్స్ అండ్ టెక్నాలజీ, సామాజిక సేవ, యువ ప్రతిభ, విద్య, వైద్యంఆరోగ్యం వంటి రంగాల్లో విశేష సేవలు అందించిన వారిని గుర్తించి పురస్కారాలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఈనాడు గ్రూప్ సీఎండీ సీహెచ్ కిరణ్, రామోజీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అమెరికా ఆధిపత్యంపై ఆసియాలో నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

నేతృత్వంలోని 'పాక్స్ సిలికా' కార్యక్రమాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు రోజులుగా కొనసాగుతున్న నిరసనల్లో ఆందోళనకారులు, పోలీసుల మధ్య ఘర్షణలు చోటుచేసుకోగా పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.మరోవైపు చైనా ఆగ్నేయాసియా దేశాలతో వాణిజ్య, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటోంది. చైనా ప్రధాని లీ కియాంగ్ మనీలా లో జరిగిన ఆసియాన్ సమావేశంలో మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఏకపక్ష విధానాలు, రక్షణాత్మక వాణిజ్య ధోరణులు, అంతర్జాతీయ ఘర్షణలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో చైనా, ఆగ్నేయాసియా దేశాలు ఐక్యంగా ఉండాలని, బయటి దేశాల జోక్యాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. గతేడాది చైనా, ఆసియాన్ దేశాల మధ్య వాణిజ్యం లక్ష కోట్ల డాలర్లు దాటిందని తెలిపారు.**క్వాడ్ సమావేశంపై ఆసక్తి** ట్రంప్ పర్యటనలో భాగంగా ఆసియాన్ దేశాల నేతలతో పాటు అమెరికా, భారత్, జపాన్, ఆస్ట్రేలియా సభ్యులుగా ఉన్న 'క్వాడ్' కూటమి సమావేశం కూడా జరగనుంది. రెండేళ్ల తర్వాత ఈ నాలుగు దేశాల నేతలు సమావేశం కానుండటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ భేటీలో ప్రధాని మోడీ పాల్గొననున్నారు. ఆసియాలో అమెరికా అనుసరిస్తున్న వ్యూహాలకు భారత్ ఎంతవరకు మద్దతు ఇస్తుందన్న అంశంపై ఆసక్తి నెలకొంది.ఇదిలా ఉండగా, చైనా-ఆసియాన్ సంబంధాలు బలోపేతమవుతున్నప్పటికీ ఆగ్నేయాసియా దేశాలు అమెరికాతోనూ వాణిజ్య సంబంధాలను విస్తరించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. మయన్మార్‌లో సైనిక పాలకులను ఆసియాన్ సమావేశాలకు దూరంగా ఉంచే విధానాన్ని కొనసాగించాలని నేతలు నిర్ణయించారు. శాంతి ప్రణాళికపై పురోగతి సాధిస్తేనే తిరిగి అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు.

కుటుంబంపై నిజాలు చెప్పేందుకే ఆత్మకథ: సోనియా

(మొదటి పేజీ తరువాయి)

పెళ్లి తర్వాత అత్తారింట్లో కొత్త వాతావరణానికి అలవాటు పడటం ప్రతి మహిళకు ఎదురయ్యే అనుభవమేనని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ అంటే తొలినాళ్లలో ఎంతో గౌరవంతో పాటు భయం ఉండేదని, ఆమె నుంచి క్రమశిక్షణ, ధైర్యం నేర్చుకున్నానని గుర్తుచేసుకున్నారు. రాజీవ్‌గాంధీ హత్య గురించి రాయడం తనకు అత్యంత బాధాకరమైన అనుభవమని తెలిపారు.**తల్లిదండ్రుల ప్రేమను గుర్తుచేసుకున్న రాహుల్** ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ తన తల్లిదండ్రులు రాజీవ్, సోనియాల అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. చిన్నతనంలో ప్రతి భోజన సమయంలో తండ్రి ఒడిలో తల్లి కూర్చునేవారని, వారి మధ్య ఉన్న ప్రేమను చూసి అదే సాధారణ కుటుంబ జీవితం అనుకునేవాడినని చెప్పారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల హత్యలు తమ కుటుంబానికి తీరని లోటుగా మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు.రాజీవ్ మరణం తర్వాత తల్లి తీవ్ర విషాదంలో కూరుకుపోయారని, ఆ సమయంలో తాను, ప్రియాంక ఆమెకు అండగా నిలిచామని తెలిపారు. సోనియా నాలుగుసార్లు క్యాన్సర్‌ను జయించారని, జీవితంలో ఎప్పుడూ భయపడటం లేదా వెనకడుగు వేయడం చూడలేదని చెప్పారు. "అమ్మా.. నాన్న నిన్ను ఎంతో ప్రేమించారు. నిన్ను చూసి ఆయన ఎంత గర్వపడేవారో చెప్పలేను" అంటూ రాహుల్ భావోద్వేగంగా ప్రసంగించారు.**పుస్తకానికి విశేష స్పందన** నవంబర్ 10న మార్కెట్‌లోకి వచ్చిన 'బిలాంగింగ్' పుస్తకానికి పాఠకుల నుంచి మంచి స్పందన లభించింది. వారం రోజుల్లోనే రెండు లక్షలకు పైగా ప్రతులు అమ్ముడైనట్లు ప్రచురణ సంస్థ హార్పర్ కాలిన్స్ వెల్లడించింది. కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, పలువురు ప్రతిపక్ష నేతలు హాజరయ్యారు.

ఓట్లు అడిగే ధైర్యం టీడీపీకి లేదు

గుంటూరు,నవంబర్ 16(నేటి మినిట్ టు మినిట్): ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే ధైర్యం లేకే చంద్రబాబు, నారా లోకేశ్ స్థానిక ఎన్నికల నిర్వహణ బాధ్యతను పోలీసులకు అప్పగించారని వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో పోలీసులను అడ్డుపెట్టుకుని ఎన్నికలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు.గుంటూరు సబ్‌జైలులో ఉన్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని సోమవారం ములాఖత్‌లో కలిసిన అనంతరం సజ్జల మీడియాతో మాట్లాడారు. ఎన్నికల నిబంధనల కు విరుద్ధంగా బ్యాలెట్ బాక్సును తరలిస్తున్న వారిని అడ్డుకున్నందుకు అప్పిరెడ్డితో పాటు వైసీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. బ్యాలెట్ బాక్సులను వైసీపీ కార్యకర్తలు స్వాధీనం చేసుకున్నట్లు, సిబ్బందిపై దాడి చేసినట్లు తప్పుడు కేసులు నమోదు చేశారని విమర్శిం చారు. **ప్రజాస్వామ్యంపై దాడి: పెద్దిరెడ్డి** మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థను ఈ స్థాయిలో దెబ్బతీసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని విమర్శించారు. పోలీసుల ద్వారా కొత్త పద్ధతుల్లో ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. పోలీసులు చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారని, ఎస్పీ, కలెక్టర్ ప్రకటనలకు భిన్నంగా ఎఫ్ఐఆర్ రూపొం దించారని పేర్కొన్నారు.ఎలాంటి ఎస్కార్ట్ లేకుండా బ్యాలెట్ బాక్సును తీసుకెళ్తున్న ఉద్యోగిని ప్రశ్నిం చినందుకు దొంగతనం, దోపిడీ, హత్యాయత్నం వంటి తీవ్రమైన సెక్షన్లతో కేసులు నమోదు చేసి జైలులో పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు రాంబాబు, మేరుగు నాగార్జున, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, చంద్రగిరి ఏసురత్నం పాల్గొన్నారు.

హరీశ్‌రావు అవినీతిపై విచారణ జరగాలి: కవిత

- ప్రజాక్షేత్రంతో పాటు న్యాయపోరాటం చేస్తాం
- త్వరలో భైరవ వాహనంతో రాష్ట్రవ్యాప్త యాత్ర

హైదరాబాద్,నవంబర్ 16(నేటి మినిట్ టు మినిట్): మాజీ మంత్రి హరీశ్‌రావు అవినీతిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆయన అవినీతికి సంబంధించిన ఆధారాలను సీబీసీఐడీ, కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు అందజేస్తామని తెలిపారు. తప్పు చేసిన వారెవరైనా చట్టప్రకారం శిక్ష పడే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సోమవారం నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ఆమె మీడియాతో మాట్లాడారు.**కరువుపై సీఎం నిర్లక్ష్యం** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కవిత విమర్శించారు. ఇటీవల ప్రధాని మోడీని కలిసిన ముఖ్యమంత్రి రాష్ట్రంలోని కరువు పరిస్థితులు, రైతుల సమస్యలను ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు.

పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లుపై కూడా ప్రధానితో మాట్లాడకపోవడాన్ని తప్పుబట్టారు. రాష్ట్రంలో కరువు మండలాలను ప్రకటించి, పంటలు వేయవద్దని సూచించిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.**రాష్ట్రవ్యాప్తంగా భైరవ యాత్ర** ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించడంతో పాటు అన్ని వర్గాలకు సామాజిక న్యాయం కల్పించడమే తమ పార్టీ లక్ష్యమని కవిత తెలిపారు. పాంచజన్య సంకల్పంలో భాగంగా త్వరలో భైరవ వాహనంతో రాష్ట్రవ్యాప్తంగా యాత్ర చేపడతామని ప్రకటించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, జాబ్ క్యాలెండర్ కూడా ప్రకటించలేదని విమర్శించారు. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

తుపాను వేళ విద్యుత్ శాఖ అప్రమత్తం

- ముందస్తు చర్యలు చేపట్టాలి: మంత్రి గొట్టిపాటి రవికుమార్



అమరావతి,నవంబర్ 16(నేటి మినిట్ టు మినిట్): ఆక్వాన్ తుపాను ముప్పు నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. విద్యుత్ వ్యవస్థకు నష్టం కలగకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. సోమవారం ఏపీఈపీడీసీఎల్ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో తుపాను సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు.విద్యుత్ స్తంభాలు కూలినా, తీగలు తెగిపడినా వెంటనే మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన స్తంభాలు, కండక్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర పరికరాలను ప్రభావిత ప్రాంతాల్లో ముందుగానే అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని, ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.**విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలి** ఈ నెల 17, 18 తేదీల్లో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, వాలిన స్తంభాలను సరిచేయడం, వదులుగా ఉన్న తీగలను బిగించే పనులు పూర్తి చేయాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి సబ్ డివిజన్ పరిధిలో అవసరమైన విద్యుత్ స్తంభాలు సిద్ధంగా ఉంచాలని, తుపాను ప్రభావం పూర్తిగా తగ్గేవరకు సిబ్బందికి సెలవులు మంజూరు చేయవద్దని సూచించారు.


ఖేలో ఇండియా గేమ్స్‌కు పటిష్ఠ ఏర్పాట్లు

హైదరాబాద్,నవంబర్ 16(నేటి మినిట్ టు మినిట్):

తెలంగాణలో నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్2026ను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు జరిగే ఈ జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని సూచించారు. క్రీడాకారులకు నాణ్యమైన వసతి, రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు క్రీడా వేదికలను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఈ పోటీలు హైదరాబాద్‌లోని పలు స్టేడియాలతో పాటు హనుమకొండ, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ నగరాల్లో జరగనున్నాయి. దేశవ్యాప్తంగా సుమారు 8 వేల మంది క్రీడాకారులు, అధికారులు, సహాయక సిబ్బంది తెలంగాణకు రానున్నారు.**విస్తృత ప్రచారానికి ప్రణాళిక** ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రధాన కూడళ్లు, బహిరంగ ప్రదేశాల్లో హోర్డింగ్‌లు, బెలూన్లతో పాటు క్రీడల మస్కట్, లోగోలను ప్రదర్శించాలని సీఎస్ సూచించారు. శంషాబాద్ విమానాశ్రయం, ప్రధాన రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. క్రీడల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా టార్చ్ ర్యాలీలు నిర్వహించాలని పేర్కొన్నారు.**వసతి, రవాణా ఏర్పాట్లు** క్రీడా పోటీల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని, క్రీడాకారులకు నాణ్యమైన వసతి కల్పించాలని సంజయ్ జాజు ఆదేశించారు. క్రీడాకారులు పోటీలు జరిగే వేదికలకు చేరుకునేందుకు ప్రత్యేక రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలల నుంచి విద్యార్థులను స్టేడియాలకు తీసుకువచ్చేందుకు కూడా తగిన రవాణా ఏర్పాట్లు చేయాలని సూచించారు. యువత పెద్ద సంఖ్యలో భాగస్వాములయ్యేలా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించాలని, మంత్రి, మాజీ క్రికెటర్ అజహరుద్దీన్ వంటి ప్రముఖ క్రీడాకారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. క్రీడాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీబాలాదేవి, సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్, ఆయా జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

సుజాత కోసం ఇంత శ్ర 'మ' ఎందుకమ్మా..?

● సుజాత కోసం ఇంత ఆరాటం ఎందు ' కమ్మా..?' ● రూ.5 లక్షల ఆరోపణలు.. ఫోన్‌పే స్క్రీన్‌షాట్ల కలకలం ● అధికారుల నివేదికలకే విలువ లేదా..? ● వెనుక ఉండి నడిపిస్తున్న ఆ మహిళా నేత ఎవరు..? ● ఉపాధి హామీనా.. ముడుపుల హామీనా..? ● శింగనమలలో రాజకీయ వ్యాపారంపై రగులుతున్న చర్చ ● అవినీతి ఆరోపణలకు అండగా రాజకీయ అభయం.. ఇదేం ప్రజాసేవమ్మా ● ఫోన్‌పేలో లావాదేవీలు.. ఫోన్లలో బుజ్జగింపులు.. ఫైళ్లలో మాత్రం నిశ్శబ్దం ● పేదలకు ఉపాధి హామీ.. పెద్దలకు ఆదాయ హామీనా..? ● అధికారుల రిపోర్టులు ఒకవైపు.. మహిళా నేతగారి పలుకుబడి మరోవైపు ● ప్రజల కోసం పదవా..? పదవి కోసం వ్యాపారమా..? ● సుజాత ఫైల్ కదలాలంటే ఎవరి గ్రీన్ సిగ్నల్ కావాలి? ● లక్షల ఆరోపణలు.. కోట్ల అనుమానాలు.. సమాధానం చెప్పేదెవరు? ● ఇసుకలో ఇంత రాజకీయం.. రాజకీయాల్లో ఇంత వ్యాపారమా? ● అవినీతిపై విచారణ వద్దా..? అండదండలపై ఆరా తీయకూడదా?



శింగనమల, m2m న్యూస్ డెస్క్: శింగనమల నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకంపై ఆరోపణలు రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తున్నాయి,ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేదలకు ఉపాధి కల్పించి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇవ్వాల్సిన పథకం. అయితే అదే పథకం కొందరు అధికారులకు, రాజకీయ అండదండలు ఉన్న వ్యక్తులకు ఆదాయ వనరుగా మారిందన్న ఆరోపణలు శింగనమల నియోజకవర్గంలో కలకలం రేపుతున్నాయి. ఈ వ్యవహారంలో ఏపీవో సుజాత పేరు ప్రధానంగా వినిపిస్తుండగా, ఆమెకు ఓ మహిళా ప్రజాప్రతినిధి అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు మరింత చర్చనీయాంశంగా మారాయి. **రూ.5 లక్షలు ఎవరి కోసం? ఎవరి చేతికి వెళ్లాయి?** ఏపీవో సుజాత వ్యవహారంలో ఐదు లక్షల రూపాయల ముడుపుల ఆరోపణలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. సుజాత నుంచి ఓ మహిళా నేతకు భారీ మొత్తంలో డబ్బులు అందాయంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అసలు ఈ లావాదేవీల వెనుక ఉన్న వాస్తవాలు ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఫోన్‌పే లావాదేవీల స్క్రీన్‌షాట్లు, బ్యాంకు స్టేట్‌మెంట్లు ఉన్నాయంటూ కొందరు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో వాటి వాస్తవికతను అధికారికంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.నిజంగానే ఆర్థిక లావాదేవీలు జరిగితే వాటి వెనుక కారణాలేమిటి? ఎవరికి ఎంత మొత్తం వెళ్లింది? ఈ వ్యవహారంలో రాజకీయ ప్రమేయం ఉందా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం కనిపిస్తోంది. **సుజాత గురించి మాట్లాడొద్దంటూ ఫోన్ చేశారా?** ఈ వ్యవహారంలో మరో ఆసక్తికరమైన ఆరోపణ తెరపైకి వచ్చింది. సుజాత వ్యవహారంపై మాట్లాడవద్దంటూ ఓ దళిత నేతకు మహిళా నేత ఫోన్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా సుజాతను వదిలేయాలంటూ ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.అసలు ఆ ఫోన్ కాల్ వెనుక ఉద్దేశం ఏమిటి? ఒక అధికారిపై వచ్చిన ఆరోపణలపై మాట్లాడకుండా రాజకీయ ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఏమిటి? తప్పు జరగకపోతే విచారణను స్వాగతించకుండా అడ్డుకునే ప్రయత్నాలు ఎందుకు? ఈ ప్రశ్నలకు సంబంధిత నేతలు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. **విచారణకు సహకరించడం లేదని నివేదికలు.. అయినా చర్యలేవీ?** ఏపీవో సుజాత విచారణకు సహకరించడం లేదంటూ సంబంధిత అధికారులు నివేదికలు ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాంటప్పుడు ఉన్నతాధికారులు ఎందుకు స్పందించడం లేదు? ఆరోపణలపై విచారణ ఎందుకు వేగవంతం కావడం లేదు?ఫోన్‌పే లావాదేవీలుగా పేర్కొంటున్న ఆధారాలు, బ్యాంకు స్టేట్‌మెంట్లు, అధికారుల నివేదికలు అన్నింటినీ పరిశీలించి నిజానిజాలు బయటపెట్టాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉంది.జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించి, ఆరోపణల్లో వాస్తవం ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **ఇసుక వ్యాపారంలోనూ లక్షల లావాదేవీల ఆరోపణలు** మహిళా నేత వ్యవహారంపై మరో కోణంలోనూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక వ్యాపారులతో లక్షల రూపాయల లావాదేవీలు జరిగినట్లు ప్రచారం జరుగుతోంది.ఓ ఇసుక వ్యాపారి నుంచి రూ.13 లక్షలకు పైగా అప్పుగా లేదా సహాయంగా తీసుకున్నారన్న ఆరోపణలు కూడా చర్చకు వస్తున్నాయి. ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించలేదంటూ సంబంధిత వర్గాలు ఆరోపిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ లావాదేవీలకు సంబంధించిన పత్రాలు, చెల్లింపుల వివరాలు, ఇరువర్గాల వాదనలు అధికారికంగా పరిశీలించాల్సి ఉంది.ఇసుక వ్యాపారంలో రాజకీయ పలుకుబడి ఉపయోగించుకుంటున్నారా? వ్యాపార ప్రయోజనాల కోసం రాజకీయ పదవిని వినియోగిస్తున్నారా? అన్న ప్రశ్నలు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారాయి. **ఎంపీటీసీలకు బెదిరింపులా? రాజకీయాల వెనుక వ్యాపార ప్రయోజనాలా?** నియోజకవర్గంలోని కొందరు ఎంపీటీసీలపై ఒత్తిడి తెస్తున్నారంటూ కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమకు అనుకూలంగా వ్యవహరించాలని రాజకీయంగా బెదిరింపులకు పాల్పడుతున్నారన్న ప్రచారంపైనా విచారణ జరగాలి.ప్రజాప్రతినిధులుగా ప్రజలకు సేవ చేయాల్సిన వారు వ్యాపార ప్రయోజనాల కోసం రాజకీయాన్ని ఉపయోగించుకుంటున్నారన్న ఆరోపణలు నిజమైతే అది ప్రజాస్వామ్య వ్యవస్థకే అవమానం. **పార్టీ పెద్దలకు ఆధారాలు అందినా స్పందన లేదా?** ఈ వ్యవహారంపై పార్టీ పెద్దలకు ఫిర్యాదులు అందినట్లు ప్రచారం జరుగుతోంది. ఆధారాలు ఉన్నాయని చెబుతున్నప్పటికీ పార్టీ నాయకత్వం ఎందుకు స్పందించడం లేదు? ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై కనీసం అంతర్గత విచారణ కూడా ఎందుకు చేపట్టడం లేదు?పార్టీ ప్రతిష్ట కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారా? అన్న ప్రశ్నలు కార్యకర్తల్లోనూ, ప్రజల్లోనూ చర్చకు వస్తున్నాయి. **రాజకీయంతో వ్యాపారమా? వ్యాపారంతో రాజకీయమా?** శింగనమల నియోజకవర్గంలో వెలుగుచూస్తున్న వరుస ఆరోపణలు అనేక అనుమానాలకు తావిస్తున్నాయి. ఉపాధి హామీ పథకం నుంచి ఇసుక వ్యాపారం వరకు వినిపిస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పథకాల్లో అవినీతి జరిగితే బాధ్యులెవరైనా వదిలిపెట్ట కూడదు. రాజకీయ అండదండలు ఉన్నాయనే కారణంతో అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారనే అనుమానాలకు తావివ్వకూడదు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందిస్తారా? ఏపీవో సుజాత వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ చేపడతారా? ఆరోపణలు ఎదుర్కొంటున్న మహిళా నేత తన వాదనను ప్రజల ముందు ఉంచుతారా? పార్టీ అధిష్ఠానం ఈ వ్యవహారంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది?ప్రజలకు సమాధానాలు కావాలి.. అధికారులకు బాధ్యత గుర్తుండాలి.. రాజకీయ నాయకులకు జవాబుదారీతనం ఉండాలి...? ఏపీవో సుజాత వెనుక ఉన్న మహిళా నేత గురుంచి మరొక కథనంతో మీ ముందుకు...

చెన్నేకొత్తపల్లిలో ఎంపీపీ పదవిపై
రాజకీయ రగడ

● అవినీతి ఆరోపణలు, బెదిరింపులు,

సామాజిక ప్రాతినిధ్యంపై చర్చ.. టీడీపీ భవిష్యత్తుపై నీలినీడలు!



చెన్నేకొత్తపల్లి,నవంబర్ 16(నేటి మినిట్ టు మినిట్): చెన్నేకొత్తపల్లి మండలంలో ఎంపీపీ పదవి కేటాయింపు రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ప్రజాసేవ, పారదర్శకత, నాయకుల గత చరిత్రను పరిగణనలోకి తీసుకోకుండా రాజకీయ సమీకరణాలకే ప్రాధాన్యత ఇస్తే ప్రజలకు ఎలాంటి న్యాయం జరుగుతుందనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. గతంలో అవినీతి, అక్రమాలకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తులకు కీలక పదవులు అప్పగించడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.బెదిరింపుల మధ్య ఎంపీపీ ఎన్నిక.. ఏకగ్రీవం వెనుక ఒత్తిళ్లు ఉన్నాయా? ప్రత్యర్థి అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేసి నామినేషన్లు ఉపసంహరించుకునేలా ఒత్తిడి తెచ్చారనే ఆరోపణలు మండలంలో వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై నిజానిజాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉంది.జనాభా ఎక్కువ.. రాజకీయ ప్రాతినిధ్యం తక్కువ? మండలంలో సుమారు 10 వేల మంది బోయలు, 4,100 మంది కురుబలు, 1,200 మంది బలిజలు ఉన్నట్లు స్థానికంగా చెబుతున్న నేపథ్యంలో ఎంపీపీ పదవి కేటాయింపులో సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇచ్చారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారులపై ఒత్తిళ్లు.. గత వ్యవహారాలపై చర్చ హౌసింగ్ బిల్లులు, సిమెంట్, వేరుశెనగ విత్తనాల పంపిణీ, నీరు-చెట్టు పనులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల వ్యవహారాల్లో అక్రమాలు, అధికారులపై ఒత్తిళ్లు తెచ్చారనే ఆరోపణలు గతంలో చర్చకు వచ్చాయి. ఈ ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరగాలని పలువురు కోరుతున్నారు.చెన్నేకొత్తపల్లిలో టీడీపీ మనుగడ ప్రశ్నార్థకమా? పార్టీ అంతర్గత అసంతృప్తి, పదవుల కేటాయింపులో వివాదాలు, నాయకుల మధ్య విభేదాలు పార్టీ భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశముందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. జోడెద్దుల జోరుతో ప్రజల చూపు ఇతర పార్టీల వైపు మళ్లుతోందనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి.మొత్తానికి ఎంపీపీ పదవి వ్యక్తిగత ప్రయోజనాలకు కాదు.. ప్రజాసేవకు ప్రతీకగా నిలవాలి సామాజిక న్యాయం, పారదర్శకత, ప్రజల విశ్వాసానికి ప్రాధాన్యతనిస్తూ పార్టీ అధిష్టానం సరైన నిర్ణయం తీసుకోకపోతే చెన్నేకొత్తపల్లిలో టీడీపీ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందనే చర్చ సాగుతోంది.

కోటి సోమవారం సందర్భంగా అన్నపూర్ణేశ్వర సేవ

- ప్రభుత్వ ఆసుపత్రి, వృద్ధాశ్రమాల్లో అన్నదాన కార్యక్రమం



అనంతపురం, నవంబర్ 16(నేటి మినిట్ టు మినిట్): పవిత్ర కార్తీక మాసంలో శ్రవణ నక్షత్రం, సప్తమి తిథితో కూడిన సోమవారాన్ని కోటి సోమవారంగా పరిగణిస్తారని సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయ సాయికుమార్ తెలిపారు. ఈ విశిష్టమైన రోజున చేసే ప్రతి మంచి కార్యం కోటిరెట్ల ఫలితాన్ని ఇస్తుందనే నమ్మకంతో భక్తులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు.కోటి సోమవారం సందర్భంగా సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద, వృద్ధాశ్రమాల్లో అన్నపూర్ణేశ్వర సేవ పేరుతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్మదా బాణలింగ ట్రస్ట్ ఆర్థిక సహాయం అందించింది. అవసరంలో ఉన్నవారికి అన్నదానం చేయడం ఎంతో పుణ్యప్రదమైన సేవ అని నిర్వాహకులు తెలిపారు.కార్తీక మాసం సందర్భంగా సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ సుమారు 200 మందికి నారాయణ సేవ నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు విజయ సాయికుమార్ వెల్లడించారు. ఈ సేవా కార్యక్రమాలకు అనంతపురానికి చెందిన, ప్రస్తుతం జైపూర్‌లో స్థిరపడిన రాఘవేంద్ర నర్మదా లింగ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహకారం అందిస్తున్నారని తెలిపారు.ఈ అన్నదాన కార్యక్రమంలో రాఘవేంద్ర, విజయభాస్కర్ రాజు, శ్రీనివాస్, రాఘవేంద్ర మాతృమూర్తి తదితరులు పాల్గొన్నారు. సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలకు సాయి ట్రస్ట్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో గోమాతకు అంతిమ సంస్కారాలు







కార్తీక మాసంలో గోమాతకు అంతిమ సంస్కారాలు నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నాం: డాక్టర్ విజయ సాయికుమార్

అనంతపురం, నవంబర్ 16(నేటి మినిట్ టు మినిట్): లక్ష్మీనగర్‌లో రోడ్డు పక్కన మృతి చెంది రెండు రోజులుగా పడి ఉన్న గోమాతకు సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి అంతిమ సంస్కారాలు చేశారు. పవిత్ర కార్తీక మాసం సుబ్రహ్మణ్య షష్టి రోజున ఈ సేవ చేసే అవకాశం కలగడం అదృష్టంగా భావిస్తున్నానని ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ విజయ సాయికుమార్ తెలిపారు.గోమాతను రాచానిపల్లి సమీపంలోని కెనాల్ వద్దకు తరలించేందుకు ట్రాక్టర్, గుంత తవ్వేందుకు జేసీబీ ఖర్చులను తన మాతృమూర్తి వై. రుక్మిణి అందించారని కృతజ్ఞతలు తెలిపారు.పాలు ఇవ్వని, వట్టిపోయిన గోవులను రైతులు రోడ్లపై వదిలేయడం బాధాకరమని, ఈ సమస్యకు అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్, మేయర్ రమేష్ గౌడ్ శాశ్వత పరిష్కారం చూపాలని డాక్టర్ విజయ సాయికుమార్ కోరారు.

కొప్పలకొండ కాస్ట్ 29 లక్షలా....?

● గుడి కడతామంటూ ఊరినే అమ్మేశారా? కొప్పలకొండలో ప్రజాస్వామ్యానికి పట్టిన వేలం పాట ● రాముడి పేరుతో రాజకీయం.. రూ.29 లక్షలకు సర్పంచ్ కుర్చీ సొంతం ● ఓటు అడగాల్సిన పనిలేదు.. వేలం పాడితే పదవి మీ సొంతం...ఇదేనా గ్రామ స్వరాజ్యం? ● గుడికి గోపురం కడతారా.. ప్రజాస్వామ్యానికి సమాధి కడతారా? ● కొప్పలకొండలో ఎన్నికలెందుకు? వేలంపాటే సరిపోతుందిగా ● ప్రజల ఓటుకు విలువ లేదా? పెద్ద నోట్లకే సర్పంచ్ కుర్చీనా? ● రూ.29 లక్షలకే సర్పంచ్ పదవి.. మరి గ్రామ ప్రజల ఓటు హక్కు విలువ ఎంత? ● వేలం జరిగితే అధికారులు ఎక్కడ? ప్రజాస్వామ్యం అమ్ముడైతే బాధ్యత ఎవరిది? ● ఎన్నికల సంఘం చూస్తుందా? లేక కొప్పలకొండ వేలంపాటకు మౌన సాక్షిగా ఉంటుందా? ● ఎన్ఓసీలపై ఆంక్షల ఆరోపణలు.. కొప్పలకొండలో అధికారుల పాత్రపై అనుమానాలు



అనంతపురం, నవంబర్ 16(నేటి మినిట్ టు మినిట్): అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కొప్పలకొండ గ్రామంలో సర్పంచ్ పదవికి రూ.29 లక్షల వేలం పాట జరిగినట్లు వెలువడిన కథనాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. గుడి నిర్మాణం కోసం గ్రామస్తులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ, ఈ వ్యవహారం వెనుక ఎన్నో అనుమానాలు, వివాదాస్పద ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.

గుడి కోసం సర్పంచ్ పదవిని వేలం వేయడమే అభివృద్ధి నమూనానా?

గ్రామానికి కావాల్సింది దేవాలయమా? లేక రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలా? ఒకవేళ రూ.29 లక్షలు గ్రామ ప్రయోజనాల కోసమే సమకూర్చాలనుకుంటే, ప్రజాస్వామ్య పదవిని వేలం వేయాల్సిన అవసరం ఏమొచ్చింది?

గుడి నిర్మాణం పేరుతో దళితులకు అన్యాయం జరిగిందా?

ఇదే వ్యవహారంలో మరింత తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే రామాలయంలోకి నేటికీ దళితులను అనుమతించడం లేదంటూ కొందరు దళిత యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఒకవేళ ఈ ఆరోపణలు నిజమైతే, అందరినీ కలుపుకొని నిర్మించాల్సిన ఆలయం పేరుతో సేకరించిన నిధులు ఎవరి ప్రయోజనాల కోసం? ఆలయంలోనే సమానత్వం లేనప్పుడు, ఆలయ నిర్మాణం కోసం ప్రజాస్వామ్య పదవిని వేలం వేయడంలో ఉన్న ఔచిత్యమేమిటి? దళిత యువకులు ప్రశ్నిస్తే వారి గొంతు నొక్కే ప్రయత్నం జరిగిందన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇందులో అసలు బాధ్యులెవరు? ఆ యువకులకు న్యాయం చేసేది ఎవరు?

కొప్పలకొండ నుంచి వస్తే ఎన్ఓసీలు ఇవ్వొద్దని ఆదేశాలిచ్చిందెవరు?

గ్రామానికి సంబంధించిన వ్యక్తులకు ఎన్ఓసీలు ఇవ్వొద్దంటూ ఆదేశాలు జారీ చేశారనే ఆరోపణలు కూడా ఈ వివాదానికి మరింత ఆజ్యం పోస్తున్నాయి. – ఈ ఆదేశాలు ఇచ్చిందెవరు? – ఎంపీడీవో కార్యాలయం పాత్ర ఏమిటి? – సంబంధిత అధికారులు ఈ వ్యవహారానికి సహకరించారా? – పోలీస్ శాఖకు ఈ పరిణామాలపై ముందస్తు సమాచారం ఉందా? – ప్రజాస్వామ్య ప్రక్రియను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరిగాయా?

ఇవన్నీ సమగ్ర విచారణలో తేలాల్సిన కీలక అంశాలు

రూ.29 లక్షలకు సర్పంచ్ పదవి.. ఎన్నికల కమిషన్ ఏం చేస్తుంది? సర్పంచ్ పదవి అనేది గ్రామ ప్రజలు తమ ఓటు హక్కుతో ఎన్నుకునే రాజ్యాంగబద్ధమైన స్థానిక పాలనా పదవి. అలాంటి పదవికి బహిరంగంగా వేలం పాట నిర్వహించడం ఎన్నికల నిబంధనల దృష్ట్యా తీవ్ర పరిశీలనకు గురికావాల్సిన అంశం. ఒకవేళ ఓటర్లను ప్రభావితం చేయడానికి డబ్బు వినియోగించినట్లు తేలితే బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? ఈ వ్యవహారంలో అధికారుల నిర్లక్ష్యం బయటపడితే వారిపై చర్యలు ఉంటాయా? గ్రామ ప్రజల ఓటు హక్కు విలువను డబ్బుతో నిర్ణయించే పరిస్థితి వస్తే ప్రజాస్వామ్యానికి మిగిలేది ఏమిటి?

గ్రామం పరువు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం

రామాలయ నిర్మాణం పేరుతో రూ.29 లక్షలకు సర్పంచ్ పదవిని వేలం వేసినట్లు వస్తున్న వార్తలు కొప్పలకొండ గ్రామాన్ని రాష్ట్రవ్యాప్తంగా చర్చలోకి తీసుకొచ్చాయి. కానీ ఈ వివాదం కేవలం ఒక గ్రామానికి సంబంధించినది కాదు. గ్రామస్థాయి ప్రజాస్వామ్య వ్యవస్థల పవిత్రత, కుల వివక్ష ఆరోపణలు, అధికారుల బాధ్యత, ఎన్నికల పారదర్శకతకు సంబంధించిన అంశం. ప్రజాస్వామ్యం అంటే ప్రజల చేతిలో అధికారం ఉండటం. పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించిన వ్యక్తి చేతిలో అధికారం పెట్టడం కాదు. అందుకే ఇప్పుడు అందరి చూపు ఎన్నికల సంఘం వైపే ఉంది. కొప్పలకొండలో జరిగినట్లు ప్రచారంలో ఉన్న వేలం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచుతుందా? బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటుందా?

అర సెంటు స్థలం కోసం...?

ఇదిలా ఉంటే, శింగనమల నియోజకవర్గం పరవల్లి ఎంపీటీసీ స్థానంలో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. పరవల్లికి చెందిన తిరుపాలమ్మ అనే మహిళకు కేవలం అర సెంటు స్థలం విషయంలో వివాదం ఉంది. తన సమస్యను పరిష్కరించాలంటూ ఆమె ఎంతో కాలంగా అధికారులు, స్థానిక నాయకుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. దీంతో తన సమస్యను తానే పరిష్కరించుకోవాలనే పట్టుదలతో తిరుపాలమ్మ నేరుగా ఎంపీటీసీ ఎన్నికల బరిలోకి దిగి విజయం సాధించారు. అయితే ఇక్కడే అసలు ట్విస్ట్ మొదలైంది. శింగనమల మండల పరిషత్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవడానికి ఏడుగురు సభ్యుల మెజారిటీ అవసరం కాగా.. ఎన్నికల్లో టీడీపీ ఆరు స్థానాలు, వైసీపీ ఆరు స్థానాలు గెలుచుకున్నాయి. దీంతో పరవల్లి ఎంపీటీసీగా గెలిచిన తిరుపాలమ్మ మద్దతు ఇప్పుడు ఇరు పార్టీలకు అత్యంత కీలకంగా మారింది. తన అర సెంటు స్థలం వివాదాన్ని ఎవరు పరిష్కరిస్తే వారికే తన మద్దతు ఉంటుందని తిరుపాలమ్మ స్పష్టం చేస్తుండటంతో.. మండల రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.మొత్తానికి ఒక చోట ఆలయ నిర్మాణం కోసం పదవికి వేలం పాట.. మరో చోట అర సెంటు స్థలం కోసం ఏకంగా కింగ్ మేకర్‌గా మారిన వైనం.. అనంతపురం జిల్లా స్థానిక ఎన్నికల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఒక ప్రశ్న మాత్రం మిగిలిపోయింది..?

గుడి నిర్మాణం కోసం సర్పంచ్ పదవిని వేలం వేశారా? లేక గ్రామ ప్రజాస్వామ్యాన్నే రూ.29 లక్షలకు బేరం పెట్టారా?కొప్పలకొండ ప్రజలకు సమాధానం కావాలి.
రాష్ట్ర ప్రజలకు నిజం తెలియాలి...?

M/S SUNIL PUBLICATIONSPrinting Press (Name & Address)PrinterM/S SUNIL PUBLICATIONS D.NO.: 28-5-782, HOUSING BOARD COLONY, REVENUE WARD NO. 28, ANANTAPUR., ANDHRA PRADESH - 515001.